క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం



సమావేశంలో పాల్గొన్న ఎస్సీ సంఘాల నాయకులు

పాలకొండ: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేపడతామని ఆ సంఘ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, గ్రామస్థాయిలో ఉద్యమం చేపడతామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 10న నిరసన ర్యాలీ చేయాలని తీర్మానం చేశారు. ఎస్సీ యువతను పోరాటంలో భాగస్వామ్యం చేయాలని సంఘ నాయకులుడు వై. లిల్లీపుష్పనాథం సూచించారు. పోరాటానికి సంబంధించి పలు కమిటీలను ఏర్పాటు చేసి వారికి బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో బత్తిన మోహనరావు, పొట్నూరు రమేష్, తిర్లంగి ఉపేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- శ్రీకాకుళం సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

సీతంపేట: ఎపిడమిక్ సీజన్‌లో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. మండలంలోని కడగండి గ్రామంలో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుత సీజన్‌లో మలేరియా, డెంగీ, డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఓంద్రుజోలలో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాలకొండ జూనియర్ సివిల్ జడ్జి విజయరాజ్‌కుమార్, వైద్యాధికారి రవీంద్ర, పాల్గొన్నారు.

పరామర్శ



తవిటిరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మండల కేంద్రానికి చెందిన పొట్నూరు తవిటిరాజు, వూణ్ణ రమణమ్మలు ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలు, సమావేశాలకు తవిటిరాజు తన కల్యాణ మంటపాన్ని ఉచితంగా ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పరామర్శలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణ, పాలవలస ధవళేశ్వరరావు, పిన్నింటి శ్రీను, శంబాన శ్రీను, కెంగువ ఆంజనేయులు, గెంబలి మహేష్, అంధవరపు మురళీకృష్ణ, జామి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ల సంఘ అభివృద్ధికి ఎనలేని కృషి ..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రైస్ మిల్లర్ల సంఘ అభివృద్ధికి పొట్నూరు తవిటిరాజు ఎనలేని కృషి చేశారని శ్రీకాకుళం జిల్లా రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ఆర్‌వీఎస్ వెంకటేశ్వరరావు(వాసు) అన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను సంఘ సభ్యులతో కలిసి సోమవారం పరామర్శించారు.

తక్కువ ఖర్చుతో చీడపీడల నివారణ



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ తిరుపతిరావు

పాచిపెంట: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగుచేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని ఏఓ తిరుపతిరావు అన్నారు. మండలంలోని అమ్మవలస గ్రామంలో సోమవారం రైతులకు ప్రకృతిలో అందుబాటులో ఉండే పత్రాలతో కషాయాలను ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కల్పించారు. దశపత్ర కషాయం, అగ్ని అస్త్రం ఎలా తయారు చేసుకోవాలి, ఎలా వినియోగించాలో ఎల్‌టు విజయ్‌కుమార్ రైతులకు వివరించారు. ఎకరానికి కేవలం 80 రుపాయిలలోపు ఖర్చుతో చీడపీడలను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే రసాయన ఎరువుల వినియోగించాలని సూచించారు. ఈ సేంద్రియ కషాయాలను తక్కువ ధరకే రైతులకు సరఫరా చేయడం జరుగుతుందని, కావాల్సిన రైతులు స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



కొమరాడ: మాదలింగిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ శెట్టి శ్యామల

కొమరాడ: బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టడం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుందని, తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో మేలు చేస్తాయని ఎంపీపీ శెట్టి శ్యామల అన్నారు. మాదలింగి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. తల్లిపాల విశిష్టతను బాలింతలు, గర్భిణులకు వివరించారు. తల్లిపాలతో శిశు మరణాల రేటు తగ్గించవచ్చన్నారు. రక్తహీనత, న్యుమోనియా, అతిసారం వంటి వ్యాధుల నుంచి బిడ్డకు రక్షణ కలుగుతుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ తుమరాడ కళావతి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లిలో..

గరుగుబిల్లి: తల్లిపాలు శిశువుకు తొలి పోషణ అని, బిడ్డకు ఆరు నెలలపాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని హెచ్‌వీ ఉదయకుమారి అన్నారు. మండలంలోని పెద్దూరు గ్రామంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. తల్లి ముర్రపాలలో ఉండే ప్రోటీన్లలో రోగనిరోధక శక్తి ఉంటుందన్నారు. తల్లిపాలు శిశువుకు అత్యంత సహజమైన, సురక్షితమైన, పుష్టికరమైన ఆహారమన్నారు. ప్రతి తల్లి తమ బిడ్డకు ఆరు నెలల వయసు వచ్చేవరకు కచ్చితంగా పాలు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది ఇప్పిలి గుణవతి, ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పాలకొండలో..



పాలకొండ రూరల్: తల్లిపాల విశిష్టతను వివరిస్తూ ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు



గరుగుబిల్లి: పెద్దూరులో తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పాలకొండ రూరల్: తల్లిపాలలో ఉండే విశిష్టమైన పోషక గుణాల ద్వారా బిడ్డ ఆరోగ్య స్థితి మెరుగుపడుతుందని అంగన్‌వాడీ కార్యకర్తలు సూచించారు. పాలకొండ నగరపంచాయతీ పరిధి రెల్లివీధిలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు బి.అమరవేణి, కె.గౌరీశ్వరి, జి.లక్ష్మి, ఎం.శ్యామల, ఎం.శ్రీదేవి, సునీత, లక్ష్మి, శారద తదితరులున్నారు.

పోరాటాలే శరణ్యం..



మాట్లాడుతున్న గిరిజన సంఘ నాయకులు

పాలకొండ రూరల్: దశాబ్దాలు గడుస్తున్నా ఆదివాసీలకు శతశాతం అందాల్సిన వసతులు అందించడంలో పాలకవర్గాలు విఫలమవుతున్నాయని ఏపీ గిరిజన సంఘ జిల్లా నాయకుడు ఎం.తిరుపతిరావు అన్నారు. మండలంలోని వెలగవాడ పంచాయతీ సిరికొండగూడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోని 93 దేశాల్లో 39 కోట్ల ఆదివాసీలు ఉన్నట్లు తెలిపారు. 1994లో ఐక్యరాజ్య సమితి ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించినప్పటి నుంచి నేటి వరకు జరుగుతున్న పరిణామాలను గిరిజనులకు వివరించారు. నేటికీ పలు గిరిజన గూడల్లో కనీస వసతులు లేవన్నారు. వసతులు కల్పించనిపక్షంలో పోరాటం చేయక తప్పదన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు ఎస్.గంగయ్య, డి.దుర్గారావు, ఎస్.మజ్జియ్య, తదితరులు పాల్గొన్నారు.

వితరణ

పాలకొండ : పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో విద్యుత్ వెలుగుల కోసం స్థానిక ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పాలవలస ధవళేశ్వరరావు రూ. లక్ష విలువ చేసే సోలార్ విద్యుత్ దీపాలను వితరణగా అందించారు. ఈ మేరకు సోమవారం ఆలయ ఆవరణలో వీటిని ఏర్పాటు చేశారు.

13న కౌన్సెలింగ్

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలికల కళాశాలలో వివిధ గ్రూపుల్లో పెంచిన సీట్లకుగాను ఈనెల 13న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ టి.రాహుల్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో 10 సీట్లు చొప్పున పెంచడం జరిగిందన్నారు. మెరిట్ ప్రకారం సీట్లు కేటాయించనున్నామని పేర్కొన్నారు.

అభినందనలు



తహసీల్దార్‌ను అభినందిస్తున్న సిబ్బంది

పాలకొండ: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆర్.బాలమురళీకృష్ణను సహచర సిబ్బంది సోమవారం అభినందించారు. ముందుగా ఆయన కోటదుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం ఆర్డీఓ, ఐటీడీఏ పీఓలను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రేగిడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వారా ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో–2 బి.ఎరకయ్య వెల్లడించారు. ఇదే విషయమై ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 14 ఏళ్ల వయసు నిండి, చదవడం, రాయడం వచ్చిన వారు పదో తరగతికి, 15 ఏళ్ల వయసు దాటి, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్మీడియట్‌కి అర్హులన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన వారు కూడా అర్హులేనన్నారు. ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు వి.లక్ష్మణరావు తెలిపారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

రేగిడి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని అంబాడ వెంకటాపురం, పెద్దశిర్లాం గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించి, పాఠశాల రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు అంచనా వేశారు. అలాగే విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి, చూసి రుచి, శుచికరమైన భోజనాలు విద్యార్థులకు పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంపై మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై మరింత దృష్టి సాధించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అలాగే పలు గ్రామాలకు చెందిన ప్రజలు సాగు, తాగునీటి అవసరాలపై వినతులు సమర్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు



రక్త పరీక్షల కోసం వేచి ఉన్న రోగులు

సీతంపేట: అడపా దడపా వర్షాలు కురుస్తుండడంతో పాటు దోమలు వృద్ధి చెందడంతో మన్యంలో మలేరియా, టైఫాయిడ్ వంటి కేసులు రోజురోజుకూ అధికమవుతున్నాయి. దీంతో పాటు వైరల్ జ్వరాలు కూడా వ్యాపిస్తున్నాయి. స్థానిక ఏరియా ఆస్పత్రికి సోమవారం రోగుల తాకిడి పెరిగింది. ఎక్కువ మంది జ్వరాలతో బాధపడుతున్నవారే. వీరందరికీ రక్త పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

బొడ్డేపల్లి మృతికి సంతాపం



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

భామిని: మండలంలోని కొరమ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేపల్లి తవుడు (65) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కోడలు, జెడ్పీటీసీ సభ్యురాలు బొడ్డేపల్లి చిన్నమ్మి, పార్టీ నాయకుడు బొడ్డేపల్లి ప్రసాద్‌లను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శలో వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు, పార్టీ నాయకులు వలరౌతు వెంకటరమణ, పిన్నింటి హరిబాబు, అగతముడి రఘు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న జనసేన, టీడీపీ శ్రేణులు

పాలకొండ రూరల్: మండంలోని గొట్ట మంగళాపురం గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి కోరాడ ఫణీంద్ర ఇటీవల తన స్వగృహంలో విద్యుత్ షాక్‌కు గురైన విషయం విదితమే. ఈ క్రమంలో ఆయనకు రెండు చేతులు తొలగించాల్సి వచ్చింది. కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్న విషయం తెలుసుకున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు రూ. 32 వేలు పోగుచేసి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో అల్లు బుల్లిబాబు, కడగల భాను, కె.వరహాలనాయుడు, కె.శ్రీనివాసరావు, కోట్ల వాసు, మురళి, శ్రీరామ్మూర్తి, తదితరులు తెలిపారు.

ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలు సజావుగా నిర్వహించాలని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 8న ఉదయం 7 గంటలనుంచి మధ్యాహ్నం 1గంట వరకు కమిటీ సభ్యుల ఎన్నిక ఉంటుందన్నారు. ప్రతీ తరగతిలో విద్యార్థుల తల్లిదండ్రులను ముగ్గురు చొప్పున ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికైన 15మంది సభ్యుల్లో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. కమిటీ సభ్యుల ఎన్నికలో ఎస్సీ, ఎస్టీ,బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలల్లో బడితోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బడితోటలో పండించిన కూరగాయలను మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎన్.నాగభూషణరావు, స్థానిక హెచ్‌ఎం ఎస్ఎల్ఎన్ పాత్రుడు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

బొబ్బిలి: పట్టణంలోని పాతబొబ్బిలి జంక్షన్‌లో పోలీసులు సోమవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఏఎస్ఐ గౌడు భాస్కరరావు ఆధ్వర్యంలో సిబ్బంది అటువైపుగా వచ్చే వాహనాలను ఆపి, వాహనదారుల లైసెన్స్, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. వాహనాలతో రోడ్లపైకి వచ్చేటప్పుడు వాహనాల ధ్రువపత్రాలు, లైసెన్స్ వెంట తీసుకురావాలన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మాదకద్రవ్యాలు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వలంటీర్లను తొలగించడం అన్యాయం



నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లను తొలగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో వలంటీర్లతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని వీవర్స్ కాలనీ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న 11 మంది వలంటీర్లను, రామకళామందిర్ పరిధిలో పనిచేస్తున్న ఐదు మంది వలంటీర్లను విధుల నుంచి తొలగిస్తున్నట్లు నోటీసులు అందించారని తెలిపారు. ఎన్నికల ముందు వీరంతా విధులకు రాజీనామా చేయలేదని.. అటువంటి వారిని సర్వీస్ నుంచి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. కేవలం రాజకీయ కక్షతో వీరిని విధుల నుంచి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్లకు జారీ చేసిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సౌకర్యాలు కల్పించాలి



ఆర్టీసీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్, ప్రయాణికులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల కోసం సౌకర్యాలు కల్పించాలని సర్పంచ్ బి.గౌరీశంకరరావుతో పాటు పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు నిత్యం వందలాది మంది ప్రయాణికులు వస్తుంటారని, వారు కూర్చోడానికి సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే కాంప్లెక్స్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో పాటు మరుగుదొడ్ల చుట్టూ తుప్పలు పెరిగిపోయాయని, రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు వెలగకపోవడం లేదని, కాంప్లెక్స్‌కు వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా ఉందని వాపోయారు. ఆర్టీసీ అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే జగదీశ్వరికి ఆహ్వానపత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ఈ నెల 9న గుమ్మలక్ష్మీపురం హెచ్ గ్రౌండ్ వద్ద నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి గిరిజన సంఘాల నాయకులు సోమవారం ఆహ్వాన పత్రం అందజేశారు. గిరిజన నాయకులు మండంగి భూషణరావు, మండంగి రమణ, కె.మల్లేశ్వరరావు, కోలక అవినాష్, పాలక క్రాంతికుమార్ తదితరులు గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి ఆహ్వానపత్రం అందజేశారు. ఐక్యరాజ్య సమితి ఆదివాసీ దినోత్సవాన్ని గుర్తించిందని, కావున ప్రభుత్వం ఆ రోజును సెవలు దినంగా ప్రకటించాలని, ఉత్సవాల నిర్వహణకు సహకరించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం



కురుపాంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి జె.సౌమ్య జోస్పిన్

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు, శివన్నపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, న్యాయమూర్తి జె.సౌమ్య జోస్పిన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ శోభారాణి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సునీల్, డాక్టర్ చీకటి శంకరరావు, దంత వైద్య నిపుణులు డాక్టర్ సుక్రిత, డాక్టర్ తనూజ, ఆప్తాల్మిక్ అధికారి రమేష్ శిబిరంలో పాల్గొని రోగులకు వైద్య సేవలందించారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం టి.శంకరరావు, న్యాయవాది బరాటం చంద్రమౌళి, ఎంపీడీఓ ఎస్.అప్పారావు, లీగల్ సెల్ కమిటీ మెంబర్ జి.వెంకటరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



గరుగుబిల్లి: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంతోష్‌కుమార్

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్ తెలిపారు. పెదగుడబలో సోమవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. కలుషిత నీటి వల్ల డయేరియా ప్రబలే అవకాశం ఉందని, కాబట్టి ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేపట్టారు.

రైల్వే మార్గం ఎంతో అవసరం..



మాట్లాడుతున్న పట్టణ పౌరహక్కుల వేదిక అధ్యక్షుడు చౌదరినాయుడు

పాలకొండ రూరల్: డివిజన్ కేంద్రం పాలకొండ మీదుగా రైల్వేమార్గం వేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని పట్టణ పౌరహక్కుల వేదిక అధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు అన్నారు. సోమవారం సహచర సభ్యులతో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పార్లమెంట్‌లో మాట్లాడుతూ విజయనగరం నుంచి రాజాం వయా పాలకొండ మీదుగా పలాస వరకు నూతన రైలుమార్గం ఆవశ్యకతను ప్రస్తావించడం హర్షణీయమన్నారు. రైలు మార్గం వల్ల ఈ ప్రాంత రావాణా వ్యవస్థ, ఏజెన్సీ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. రైల్వే మార్గం సాధన కోసం ఈ నెల పదో తేదీన సాయంత్రం ఆరు గంటలకు స్థానిక ఎలైట్ కళాశాల ప్రాంగణంలో సమావేశం నిర్వహిస్తామని.. అన్నివర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు.

రాయితీపై పైనాపిల్ మొక్కల పంపిణీ

సీతంపేట: గిరిజనులకు 90 శాతం రాయితీపై మారిషస్ వెరైటీ పైనాపిల్ మొక్కలను పంపిణీ చేయనున్నట్లు హార్టికల్చర్ ఆఫీసర్ పి.జయశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 సెంట్లు ఆ పైన పొలం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వీటిని తీసుకున్న రైతులకు 90 శాతం రాయితీపై స్ప్రేయర్లను కూడా అందజేస్తామన్నారు. ఈనెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ల్యాండ్ డాక్యుమెంట్ జిరాక్స్, బ్యాంకు పాస్‌పుస్తకం, పాస్‌ఫోటోతో అప్లై చేసుకోవాలన్నారు.